క్లుప్తంగా

సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను సెప్టెంబర్ చివరి వారంలోనే ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షులు బసవరాజ్ దేశాయ్ డిమాండ్ చేశారు. ఈమేరకు భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో శనివారం పెద్దకొడప్‌గల్‌లో డిప్యూటీ తహసీల్దార్ రవికాంత్‌కు నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బోడి రాజు యాదవ్, సహాయ కార్యదర్శి బోడి మల్లికార్జున్ యాదవ్, బాన్సువాడ డివిజన్ సభ్యులు మొలుగు సంజీవరెడ్డి, దేమి నరేందర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటలపై అడవి పందుల దాడి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి శివారులోని మొక్క జొన్నపంటను అడవి పందులు ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు. గురు, శుక్ర వారం రాత్రి తాడ్వాయికి చెందిన మెట్టు బాలు రాజు, విఠల్‌రెడ్డి, స్వామి, యశోద, నర్సింలకు సంబంధించిన మొక్కజొన్న పంటపై అడవి పందులు దాడిచేశాయి. దీంతో ఆర్థికంగా నష్టపోయామని రైతులు వాపోయారు. వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

గుంతలు పూడ్చివేత



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని పలు కాలనీలలో వర్షాల కారణంగా రహదారులపై ఏర్పడిన గుంతలను శనివారం పంచాయతీ అధికారులు పూడ్చివేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బలరాం మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని పలు కాలనీలలో వర్షాలకు రహదారులపై గుంతలు ఏర్పడ్డాయని కాలనీవాసులు తెలపడంతో మొరం వేసి గుంతలను పూడ్చివేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామ్‌రెడ్డి, ఇమ్రోజ్, అద్నాన్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మేటల తొలగింపునకు కొలతలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బూరుగిద్ద శివారులోని ఊర కుంట కింద ఏర్పడిన ఇసుక మేటల పరిమాణ కొలతలను శనివారం అధికారులు నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఊరకుంట కట్ట తెగిపోయింది. కుంట ఆయకట్టు కింద పంట పొలాల్లో ఇసుక మేటలు, మొరం దిబ్బలు ఏర్పడ్డాయి. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు ఎంపీడీవో నరేష్, మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ ఉపాధి హామీ సిబ్బందితో ఇసుక మేటలు, మొరం దిబ్బలు ఏ మేరకు పరిమాణం లోతు వరకు పేరుకుపోయాయని కొలతలు నిర్వహించారు. ఉపాధి హామీ కింద వాటిని తొలగించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో నరేందర్, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



బాన్సువాడ : రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి అన్నారు. హ్యూమానిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఎంసీహెచ్‌లో 50 మంది ముస్లిం యువకులు రక్తదానం చేశారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హ్యూమానిటీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మౌలానా రిజ్వాన్, నాయకులు ఎజాస్, షకీల్, వైద్యులు విజయభాస్కర్, అయ్యూబ్, అమీర్, బ్లడ్ బ్యాంక్ వీఆర్వో ఆనంద్, ల్యాబ్ టెక్నీషియన్లు శ్రీనివాస్, రాఘవేందర్, కల్యాణి తదితరులున్నారు.

కొత్త పింఛన్ కోసం ఎదురుచూపులు

- ఏళ్లుగా మంజూరు కోసం వృద్ధులు, దివ్యాంగుల నిరీక్షణ
- భర్త చనిపోతేనే భార్యకు కొత్త పింఛన్
- బిచ్కుందలో 1,344 మంది దరఖాస్తులు

బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ మందులు ఇతర అవసరాలకు దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి, వితంతు మహిళలకు ఆసరాగా ఉంటుంది. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం కొత్త పింఛన్ మంజూరు చేయలేదు. అన్ని అర్హతలు ఉన్నా పింఛన్ కోసం లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. బిచ్కుంద మండలంలో 1,344 మంది పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తుల స్వీకరణ..

సంక్షేమ పథకాల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అర్హులైన వారికి పథకాలు, పింఛన్లు అందిస్తామని ప్రకటించింది. పింఛన్ పొందేందుకు వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు కార్యాలయాలకు పరుగెత్తి ఆశతో ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్నారు. మండలంలో పింఛన్ కోసం వృద్ధులు 738 మంది, వితంతువులు 311, దివ్యాంగులు 63, ఒంటరి మహిళలు 90, బీడీ కార్మికులు 138, గీత కార్మికులు 4 మంది మొత్తం 1,344 మంది పింఛన్ కోసం దరఖాస్తు చేసుకొని ఏడాది దాటినా మంజూరు కాలేదు. కుటుంబంపై ఆధారపడిన దివ్యాంగులు పింఛన్ కోసం ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రతినిధులు చుట్టూ పింఛన్ కోసం చక్కర్లు కొడుతున్నారు.



బిచ్కుందలో పింఛన్ కోసం క్యూలో ఉన్న వృద్ధులు

భర్త చనిపోతే భార్యకు పింఛన్...

ఇంట్లో భార్య, భర్తలు ఇద్దరు పింఛన్‌కు అర్హులు ఉన్నప్పటికి ఒక్కరికే పింఛన్ అందుతుంది. కాంగ్రెస్ పార్టీ ఇంట్లో భార్య, భర్తలు ఇద్దరు అర్హులు ఉంటే ఇద్దరికి పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పింఛన్ల ఊసెత్తడం లేదు. పింఛన్ తీసుకుంటున్న భర్త చనిపోతే భార్య దరఖాస్తు పెట్టుకుంటే కొత్త పింఛన్ మంజూరు అవుతుంది. ప్రభుత్వం పింఛన్ దారులతో పాటు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు పెట్టుకున్న వారికి కార్డులు మంజూరు అయ్యాయి. పింఛన్లు మంజూరు కాలేదు. రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం కొత్త వారికి పింఛన్ మంజూరు చేస్తే వారి ఓటు ద్వారా లబ్ధిపొందవచ్చని స్థానిక నాయకులు భావిస్తున్నారు.

పింఛన్లు మంజూరు చేయాలి



కొత్త పింఛన్ కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా. నాలుగేళ్ల నుంచి పింఛన్ కోసం ఎదురు చూస్తున్నా. వృద్ధాప్యంలో మందుల కోసం పింఛన్ ఆసరాగా నిలుస్తోందని భావిస్తున్నా. ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేస్తుందని ఆశతో ఉన్నాం.

– దర్పల్ గణపతి, దరఖాస్తుదారు, బిచ్కుంద

అధికారులకు పంపించాం



ప్రజాపాలనలో చాలా మంది లబ్ధిదారులు పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని పరిశీలించి జిల్లా అధికారులకు పంపించాం. ప్రభుత్వం మంజూరు చేసిన వెంటనే అర్హులకు గుర్తించి పింఛన్లు ఇస్తాం. పింఛన్ పొందుతున్న భర్త లేక భార్య చనిపోతే వెంటనే పింఛన్ వారి పేరుమీద బదిలీ చేసి పింఛన్ ఇస్తున్నాం. కొత్త పింఛన్లు త్వరలోనే మంజూరు కావొచ్చు.

– గోపాల్, ఎంపీడీవో బిచ్కుంద

ఓటరు జాబితా విడుదల



బిచ్కుందలో ఓటరు జాబితా విడుదల చేస్తున్న అధికారులు



భిక్కనూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో..

భిక్కనూరు/బిచ్కుంద : మండలంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల ముసాయిదా జాబితా ను భిక్కనూరు గ్రామపంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డుపై ఈవో మహేష్‌గౌడ్ శనివారం అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఈ జాబితాలో తమ పేర్లు ఉన్నాయే లేదో సరి చూసుకోవాలని సూచించారు. బిచ్కుంద మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గోపాల్, ఎంపీవో కృష్ణ కొత్త ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేశారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలకు 10 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ ఉందన్నారు. మండలంలో 28,544 ఓటర్లు, 51 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు.

గ్రామ సంఘాల ఆడిట్



సదాశివనగర్(ఎల్లారెడ్డి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ సంఘాల ఆడిట్‌ను నిర్వహించారు. అన్ని గ్రామాలకు సంబంధించిన 2024–25వ ఆర్థిక సంవత్సరం 2వ అర్ధ సంవత్సర పుస్తకాలు, ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం ఫైనాన్స్ రాజయ్య, ఏపీఎం ప్రసాద్, ఆడిటర్‌లు సంగారెడ్డి, సీఏలు మమత, పద్మ, సీసీలు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ సంఘాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో గల మహిళ సంఘాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలని ఐకేపీ ఏపీఎం రాజు అన్నారు. తాడ్వాయి గ్రామసమాఖ్య కార్యాలయంలో శనివారం గ్రామ సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఆర్థిక లావాదేవీలపై చర్చించుకున్నారు. ప్రతినెల పదోతేదీలోపు శ్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు చెల్లించేలా తీర్మాణాలు చేశారు. అర్హులైన గ్రూపులకు బ్యాంకు లింకేజి, శ్రీనిధి ద్వారా రుణాలు పొందాలన్నారు. కార్యక్రమంలో సీసీ రమేష్‌గౌడ్ వీవోఏలు, పొదుపుసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పటేల్‌చెరువు గండి పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామశివారులోని పటేల్‌చెరువుగండిని శనివారం ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి పరిశీలించారు. భారీవర్షాలకు పటేల్‌చెరువకు గండి పడడంతోపాటు చెరువును ఆనుకొని ఉన్న పోచారం ప్రధానకాలువ ఇరువైపులా కట్టలు కొట్టుకుపోయి ధ్వంసమైంది. ఈ క్రమంలో ఆర్డీవో చెరువు గండితోపాటు ధ్వంసమైన పోచారం ప్రధాన కాలువను పరిశీలించారు. చెరువుగండి పూడ్చివేతతోపాటు పోచారం ప్రధానకాలువకు చేపట్టాల్సిన మరమ్మతు పనులను నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావుతో చర్చించారు. మరమ్మతు పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని తహసీల్దార్‌కు ఆయన సూచించారు. ఆర్‌ఐ మహ్మద్ ఉన్నారు.



గండిని పరిశీలిస్తున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి

ప్రమాదపు అంచున ప్రయాణం

రాజంపేట: ఇటీవల కురిసిన వర్షాలకు మండంలో రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. వాహనదారులకు ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. రాజంపేట గ్రామ శివారులోని అర్గెలాగు ప్రాంతంలో రోడ్డు చాలా వరకు కోతకు గురైంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాజంపేట , శివాయిపల్లి గ్రామాల మధ్య రాకపోకలు కొనసాగించాలంటే జంకుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



రాజంపేట, శివాయిపల్లి గ్రామాల మధ్య కోతకు గురైన రోడ్డు

మరమ్మతులకు నోచుకోని రహదారి

నిజాంసాగర్(జుక్కల్): ఇటీవల కురిసిన వర్షాలు, వరద నీటి ప్రవాహాల కారణంగా బొగ్గు గుడిసె చౌరస్తా వద్ద ప్రధాన రహదారి కోతకు గురైంది. ఎన్‌హెచ్ 765 డి రోడ్డు విస్తరణ పనులకు వరద తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వరదలతో కోతకు గురైన రహదారి పది రోజుల నుంచి తాత్కాలిక మరమ్మతులకు నోచుకోవడం లేదు. బొగ్గు గుడిసె చౌరస్తాతో పాటు గండెమ్మ గుడి వద్ద రహదారి కొట్టుకుపోయి ప్రమాదానికి నిలయంగా ఉంది.

పది రోజుల నుంచి పత్తాలేని బస్సులు

మహమ్మద్ నగర్, నర్వ, అన్నాసాగర్, బొగ్గు గుడిసె చౌరస్తా ప్రాంతాల్లో వరదల తాకిడికి బాన్సువాడ– ఎల్లారెడ్డి ప్రధాన రహదారి కోతకు గురైంది. గత నెల 28 న భారీ వర్షాలు, వరద కారణంగా రహదారి పూర్తిగా దెబ్బతింది. ఆ రోజు నుంచి బాన్సువాడ– ఎల్లారెడ్డి మధ్యన ఆర్టీసీ బస్సుల ప్రయాణం నిలిచింది. రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు సైతం చేపట్టకపోవడంతో ఈమార్గంలో బస్సులను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు మర్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తుంకిపల్లి తండా రోడ్డు మధ్యలో గుంత

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయిలోని వేంకటేశ్వర ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చుట్టూ భక్తులు తిరుగుతూ పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.



పూజలు చేస్తున్న భక్తులు

తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద నివాళి



బాన్సువాడ రూరల్: మండలంలోని కొయ్యగుట్ట చౌరస్తాలో గల తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ మలిదశ ఉద్యమకారులు శనివారం నివాళి అర్పించారు. తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించి ఉద్యమ సమయంలో జిట్టా పోరాటాలను గుర్తుచేసుకున్నారు. యువజన సంఘాలను బలోపేతం చేసి జిట్టా ఫౌండేషన్ ద్వారా అనేక సేవాకార్యక్రమాలు నిర్వహించారన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉడుత గంగాధర్, మండల అధ్యక్షులు చందు, కార్యదర్శి భాస్కర్, మీడియా కన్వీనర్ దండు విజయ్, నాయకులు ఎర్రవట్టి సాయిబాబ, మహేశ్ చందర్, శ్యామ్ రాజు, యోగేశ్వర్, నాగభూషణం, దత్తు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న బ్యాంక్ ఉద్యోగులకు సన్మానం

భిక్కనూరు: స్థానిక తెలంగాణ బ్యాంక్‌లో పనిచేసేస్తున్న మేనేజర్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్‌ఆఫీసర్ బాల్‌కిషన్, క్యాషియర్ రాజేందర్‌లు బదిలీపై వెళ్లారు. వీరిని శనివారం బ్యాంక్‌లో ఖాతాదారులు ఐకేపీ సిబ్బంది సన్మానించారు.బదిలీపై వెళ్తున్న అధికారులను మెమెంటోలు శాలువాలతో సత్కరించారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీ

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శనివారం తనిఖీ చేసినట్లు ఏవో రాజలింగం తెలిపారు. ఎరువుల బస్తాల నిలువలు,పురుగు మందులు, రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. ప్రతిరోజు ఎరువుల నిలువలు,ధరలు దుకాణా ల్లో బోర్డులపై ప్రకటించాలని సూచించిన ట్లు తెలిపారు.ఆయనతో పాటు ఏఈవోలున్నారు.



గాంధారిలో ఎరువుల నిలువలను పరిశీలిస్తున్న ఏవో రాజలింగం

ఉపాధ్యాయులకు సన్మానం



ఎల్లారెడ్డిలో ఉపాధ్యాయులను సన్మానించిన టీచర్స్ గణేశ్ మండలి బృందం



కంభాపూర్ స్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీచర్లు

సాక్షి, నెట్‌వర్క్ : జిల్లాలో పలు చోట్ల శనివారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎల్లారెడ్డిలో టీచర్స్ గణేశ్ మండలి బృందం, కామారెడ్డిలో రోటరీ క్లబ్, ఆరే క్షత్రీయ జిల్లా సంఘం, బీర్కూర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా టీచర్లను సన్మానించారు.



కామారెడ్డిలో రోటరీ ఆధ్వర్యంలో సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు



ఆర్యక్షత్రీయ జిల్లా సంఘం ఆధ్వర్యంలో..



బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

ఘనంగా అనంత చతుర్దశి వేడుకలు



అనంత పద్మనాభస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



కోటి వత్తులను వెలిగిస్తున్న భక్తులు

భిక్కనూరు: భిక్కనూరు మండల కేంద్రంలో జిల్లాలోనే ఏకైక అనంత పద్మనాభస్వామి ఆలయంలో అనంత చతుర్దశి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా మెదక్, రాజన్న–సిరిసిల్లా, సిద్దిపేట, మెదక్ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వేదబ్రాహ్మణుల పెద్దెడ్ల జయప్రకాశ్‌శర్మ, రాము శర్మల ఆధ్వర్యంలో అనంత పద్మనాభస్వామికి పంచామృతాభిషేకాలు అర్చనలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు అనంత కోటి ఒత్తులను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అన్నప్రసాదం పంపిణీ నిర్వహించారు. స్వామి వారిని మూడు వేల మంది ప్రజలు దర్శించుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి డివిజన్ సబ్ యూనిట్ అధికారి గోవిందరెడ్డి సూచించారు. శనివారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి రాంపూర్ గ్రామంలో ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దోమ లార్వా, దోమల నివారణ చర్యలు, దోమలు కుట్టకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కాచి చల్లార్చిన నీటిని ఉపయోగించాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు రాంబాయి, ఠాగూర్, కార్యదర్శి మమత, లక్ష్మణ్, ఆరోగ్య కార్యకర్తలు సునిత, లక్ష్మి, రాజ్యలక్ష్మి, గంగమణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



రాంపూర్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఎల్లారెడ్డిలో దివ్యాంగ వైకల్య నిర్ధారణ శిబిరం

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం దివ్యాంగ వైకల్య నిర్ధారణ శిబిరాన్ని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. 1 నుంచి 18 ఏళ్ల ఉన్న దివ్యాంగులకు వైద్యులు వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వీరిలో అర్హులైన వారికి ట్రైసైకిళ్ళు, వీల్‌చైర్లు, హియరింగ్ మిషన్లు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు నాగవేందర్ వైద్యులు కాంబ్లే, ఉపాధ్యాయులు మాధవి తదితరులున్నారు.



దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సీతాయిపల్లిలో పశువైద్య శిబిరం



సీతాయిపల్లిలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని సీతాయిపల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించినట్లు పశువైద్యుడు వేణు తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 80 పశువులకు వివిధ రకాల చికిత్సలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, పలువురు డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు సింగసాని శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో వేగం పెంచాలి



బీబీపేటలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణచంద్రోయకుమార్

బీబీపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని ఎంపీడీవో పూర్ణచంద్రోయకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇప్పటికే మొదటి విడత నిధులు వచ్చాయని త్వరితగతిన ఇళ్లు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఇంటి నిర్మాణంలో నాణ్యత పాటించాలని తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి రమేష్, తదితరులు పాల్గొన్నారు.